సాక్షి
ఒడిశా

గురువారం । 9 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,09,892లు, బంగారం 3 గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 36 గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పట్టాలు తప్పిన బీజేడీ పాలన

రాష్ట్రంలో బీజేడీ పాలన పట్టాలు తప్పిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు.

- 8లో.



గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అబ్కారీ శాఖ సిబ్బంది అరెస్టు చేశారు.

- 8లో.

న్యూస్‌రీల్

గంజాంలో సీఎం పర్యటన నేడు



కొరపల్లిలో సిద్ధమైన సభా ప్రాంగణం

బరంపురం: గంజాం జిల్లాలోని ఎన్నికల ప్రచారం నిమిత్తం సీఎం నవీన్ పట్నాయక్ గురువారం పర్యటించారు. దీనిలో భాగంగా గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని నవీన్ నివాస్ నుంచి బిజూ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకొని ప్రత్యేక హెలీకాప్టర్‌లో గంజాం జిల్లా బరంపురం నగరానికి దగ్గర రొంగయిలొండా పరిధిలోని పాలురు హిల్స్‌లో దిగుతారు. అక్కడకి దగ్గర కొరపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం ప్రత్యేక హెలీకాప్టర్‌లో అస్కా వెళ్లనున్నారు. అక్కడ కూడా పార్టీ బహిరంగ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం కొందమాల్ జిల్లా పుల్బణికి చేరుకొని ప్రసగించనున్నారు. తిరిగి పుల్బణి నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌కి పయనమవుతారు.

యువకుడి నుంచి తుపాకీ స్వాధీనం



తుపాకీతో పట్టుబడిన రాజేష్ హరిజన్

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్రా సమితిలో ఒక యువకుడి వద్ద కుంద్రా పోలీసులు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం రాజకుంద్రా జంక్షన్ వద్ద ఆ యువకుడి వద్ద తుపాకీ కనుగొన్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు. పట్టుబడిన వ్యక్తి జయపురం సమితి కొరాపుట్‌కు చెందిన రాజేష్ హరిజన్(25) అని వెల్లడించారు. రాజేష్ హరిజన్‌కి గతంలో అనేక నేరాలతో సంబంధం ఉన్నట్లు తమ వద్ద సమాచారం ఉన్నట్లు వెల్లడించారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని పేర్కొన్నారు.

వారాంతపు సంతలే ప్రచార వేదికలు



దుకుం సంతలో మాట్లాడుతున్న మంత్రి సరక

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రచారానికి కొద్దిరోజులు మాత్రమే గడువు ఉండడంతో తక్కువ సమయంలో ఎక్కువ ప్రచారం జరిగేలా ప్రధాన పార్టీలు సన్నాహాలు చేస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాలో జరిగే వారాంతపు సంతలపై ప్రచారానికి అధిక దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం నుంచి మూడోసారి వరుసగా పోటీ చేస్తున్న రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక నియోజకవర్గం పరిధిలోని దుకుం వారపు సంతలో ప్రచారాన్ని బుధవారం కొనసాగించారు. ఆయనతో పాటు బీజేడీ రాష్ట్రశాఖ సాధారణ కార్యదర్శి సుధీర్ దాస్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సరక మాట్లాడుతూ రెండుసార్లు ఈ నియోజకవర్గం నుంచి మరోసారి అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలోని పెండింగ్ పనులను పూర్తి చేయనున్నట్లు తెలియజేశారు. నవీన్ పట్నాయక్ మరోసారి ముఖ్యమంత్రిగా గెలుస్తున్నారని దీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ నియోజకవర్గం అభివృద్ధి దిశగా పయనిస్తోందని పేర్కొన్నారు.

3.77 కేజీల బంగారం స్వాధీనం

- నలుగురు అరెస్టు



డీఆర్‌ఐ తనిఖీలో బయటపడిన అక్రమ బంగారం

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.2.79 కోట్ల విలువైన 3.77 కిలోల స్మగ్లింగ్ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) బుధవారం తెలిపింది. ఈ నెల 6న దుబాయ్ నుంచి భువనేశ్వర్ చేరుకున్న నలుగురు అనుమానిత ప్రయాణీకులను నిఘా ఆధారంగా గుర్తించారు. వారిని విచారించగా.. పురీషనాళంలో దాచి పేస్ట్ రూపంలో అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించినట్లు తేలింది. దర్యాప్తులో పేస్ట్ రూపంలో ఉన్న బంగారం మొత్తం 12 బిస్కెట్లు బయటపడ్డాయి. ప్రత్యేక ప్రక్రియతో వీటి నుంచి 3.77 కిలోల బరువున్న బంగారం తీశారు. నలుగురు నిందిత ప్రయాణీకులను కస్టమ్స్ చట్టం, 1962 నిబంధనల ప్రకారం అరెస్టు చేశామని, తదుపరి విచారణ కొనసాగుతోందని డీఆర్‌ఐ తెలిపింది.

ఆలూ లేదు.. చూలు లేదు..!

- రాష్ట్రంలో ఇంకా మొదలవ్వని పోలింగ్
- అప్పుడే ప్రమాణ స్వీకారాలకు పిలుపులు
- జూన్ 9న బీజేడీ, 10న బీజేపీ ప్రభుత్వాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన

భువనేశ్వర్: ఆలూ లేదు.. చూలు లేదు అల్లుడు పేరు సోమలింగం అన్నట్లు మారింది రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల పరిస్థితి. రాష్ట్రంలో ఇంకా పోలింగ్ ప్రక్రియ మొదలవ్వకముందే ప్రమాణ స్వీకారాలకు పిలుపులు అంటూ హడావుడి చేస్తున్నాయి. కొత్త ప్రభుత్వాల ఏర్పాటుకు ముహూర్తాలు ఖరారు చేసి రాష్ట్ర ప్రజలకు సోషల్ మీడియా వేదిక నుంచి ఆహ్వానాలు పంపాయి. ఇంకా ఓటరు నాడి తెలియక ముందే పార్టీలు ఈవిధంగా పిలుపునివ్వడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

• సుమూహూర్తాలు ఖరారు


జూన్ 9వ తేదీ ఉదయం 11.30 గంటలకు భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని బిజూ జనతా దళ్ ప్రకటించింది. అదేవిధంగా జూన్ 10న రాష్ట్రంలో తొలిసారిగా డబుల్ ఇంజిన్ సర్కారు బీజేపీ నేతృత్వంలో ఏర్పాటు అవుతుందని, ఆ రోజున రాజధాని భువనేశ్వర్‌లో బీజేపీ అభ్యర్థి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ కార్యక్రమాలకు ప్రజలంతా ఆహ్వానితులేనని ఇరుపార్టీల నేతలు పిలుపునిచ్చారు.

• పగటి కలలు కంటున్నారు: సీఎం నవీన్

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని ఆ పార్టీ పెద్దలు పగటి కలలు కంటున్నారని సీఎం నవీన్ పట్నాయక్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని అనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. మరోసారి రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు అందజేయడానికి బీజేడీ ప్రభుత్వమే ఏర్పడుతుందని దీమా వ్యక్తం చేశారు.

• బీజేడీ కథ ముగుస్తుంది: పీఎం మోదీ

ఈ సార్వత్రిక ఎన్నికలతో రాష్ట్రంలో బీజేడీ కథ ముగుస్తుందని పీఎం నరేంద్ర మోదీ అన్నారు. జూన్ 4తో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం గద్దె దిగడం తథ్యమన్నారు. బీజేపీ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలంతా ఆహ్వానితులేనని సభాముఖంగా పిలుపునిచ్చారు.



ఎక్స్ హ్యాండిల్‌లో బీజేడీ ప్రమాణ స్వీకారోత్సవం ఆహ్వాన పత్రిక

• బీజేడీ ఉలికిపాటు

నిజానికి పీఎం మోదీ ప్రకటనతో బీజేడీ ఉలికిపాటుకు గురైంది. ప్రచార సభ వేదిక నుంచి మోదీ బహిరంగ ప్రకటనపై బీజేడీ అకస్మాతుగా ప్రతిస్పందించింది. సాంఘిక ప్రసార (ఎక్స్ హ్యాండిల్) మాధ్యమంలో బీజేపీ దీమాని ఖండించే సందేశంతో ఓటరుని కిర్రెక్కించింది. మోదీ ప్రకటన పేర్కొన్న నేపథ్యంలో బిజూ జనతా దళ్ (బీజేడీ) సోషల్ మీడియాలో వినూత్న ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వరుసగా ఆరోసారి నవీన్ పట్నాయక్ ప్రమాణ స్వీకారం చేస్తారని బీజేడీ అధికార ప్రతినిధి డాక్టర్ సస్మిత్ పాత్రో సాంఘిక మాధ్యమంలో ప్రకటించి ప్రజలకు ఆహ్వానం పలికారు.



బీజేపీ వినూత్న ప్రచార శైలి

• అధికారంపై ఆశలు

సార్వత్రిక ఎన్నికల తుది ఫలితాలతో సరికొత్త రికార్డులు నెలకొలుపుతామని ఉభయ బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ ఆశలు పెట్టుకున్నాయి. దీర్ఘకాలిక ముఖ్యమంత్రిగా రికార్డు కోసం బీజేడీ, చారిత్రాత్మకంగా తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని బీజేపీ ఘంటాపథంగా చెబుతున్నాయి. వరుసగా ఆరోసారి ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్ రాష్ట్రంలో బీజేడీ సర్కారు ఏర్పాటు చేసి దీర్ఘ కాలిక ముఖ్యమంత్రిగా జాతీయ రికార్డు నెలకొలుపుతామని అధికార పక్షం ఆశల పల్లకిలో ఊరేగుతోంది. దీర్ఘ కాలిక నవీన్ సర్కారుని గద్దె దించి తొలిసారిగా రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి సరికొత్త చరిత్ర ఆవిష్కరిస్తుందని బీజేపీ ఊహల పల్లకిలో తేలియాడుతోంది.

సరికొత్త శైలి

ఈసారి సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సరికొత్త శైలి ఓటరు వర్గాన్ని ఆలోచింపజేస్తోంది. ఎన్నికల్లో గెలిచేందుకు ఓటరుని అభ్యర్థించే సంప్రదాయం దారి మళ్లింది. సర్కారు ఏర్పాటు చేయడం తథ్యమని ఓటరు నిర్ణయాన్ని ముందస్తుగా నిర్ధారించి ఓటరుని పరోక్షంగా ఉభయ అధికార బీజేడీ, ప్రధాన విపక్షం బీజేపీ బురిడి కొట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రజాతంత్ర వ్యవస్థలో ఓటరు నిర్ణయాత్మక శక్తిని క్రమంగా నీరు గారించే కుతంత్ర సంస్కృతి బీజం నాటుకుంటుంది. ఈ పరిస్థితిపై సగటు ఓటరు విచక్షణతో ఓటుహక్కు అధికారాన్ని శక్తివంతంగా ప్రయోగించే ప్రజాస్వామ్య సంప్రదాయ పరిరక్షణ దిశలో అడుగు వేయాల్సిన సమయం ఆసన్నమైనట్లు గుర్తించాల్సి ఉంది.

ఈనెల 10న పీఎం మోదీ పర్యటన

- మాస్టర్ క్యాంటిన్ నుంచి రోడ్ షో



భువనేశ్వర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 10వ తేదీన భువనేశ్వర్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాస్టర్ క్యాంటీన్ కూడలి నుంచి వాణీవిహార్ వరకు జనపథ్ మార్గంలో రోడ్ షో కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రధానమంత్రి భారీ ప్రచారం కమిషనరేట్ పోలీస్‌కు పెను సవాలు. ఈ నేపథ్యంలో భద్రతా వ్యవస్థను కట్టుదిట్టం చేసేందుకు అన్ని రకాల సన్నాహాలు చేస్తున్నారు. కమిషనరేట్ పోలీసులతో పాటు ప్రధాని భద్రతను నిర్వహిస్తున్న ప్రత్యేక రక్షణ బృందం ఎస్పీజీ రోడ్ షో భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రధాని భద్రతకు సంబంధించిన ఎస్పీజీ బృందం రోడ్ షో స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కమిషనరేట్ పోలీసు, రోడ్లు భవనాలు శాఖ, భువనేశ్వర్ నగర పాలక సంస్థ బీఎంసీ అధికారులు ఎస్పీజీ బృందంతో కలిసి రామాలయ వీధి సమీపంలో సమగ్ర సన్నద్ధత ప్రక్రియను సమీక్షించారు.

ఇరువైపులా బారికేడ్లు

మాస్టర్ క్యాంటీన్ నుంచి వాణీ విహార్ వరకు రహదారికి ఇరువైపులా బలమైన బారికేడ్లు ఉంటాయి. అందువల్ల రహదారికి ఇరువైపులా ఉన్న అన్ని పెద్ద భవనాలు, షాపింగ్ మాల్స్, ఇతర మార్కెట్లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రోడ్ షో సమయంలో వాటిని భద్రతా వలయం పరిధిలో ఉంచుతారు. షాపుల ముందు పోలీసు సిబ్బంది, మాల్ వద్ద సెక్యూరిటీ గార్డులు కాపలా ఏర్పాటు చేస్తారు. మార్కెట్ కాంప్లెక్స్‌ను పోలీసు క్యాంపు కనుసన్నల్లో ఉంచనున్నారు. కమిషనరేట్ పోలీస్‌లోని ట్రాఫిక్ వింగ్, సెక్యూరిటీ వింగ్, ఇంటెలిజెన్స్ వింగ్, కార్కేడ్ అధికారులు హాజరై భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన బ్లూ ప్రింట్‌ను సిద్ధం చేశారు. రోడ్ షోలో బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారిస్తున్నారు. రోడ్ షో సందర్భంగా రోడ్డు వినియోగదారుల కోసం వాహనాల దారి మళ్లింపు ఏర్పాటు చేసి ప్రజలకు ముందుగానే సమాచారం అందించనున్నారు. ప్రధానమంత్రి భద్రతకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి తనిఖీ చేయబడుతోందని డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. బ్లూ బుక్ నిబంధనల ప్రకారం భారీ బందోబస్తుతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్ షో మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉంటుంది. ఈ ప్రాంతాన్ని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటిస్తారు.

ఏనుగుల గుంపు సంచారం



సంచరిస్తున్న ఏనుగు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ అటవీ రేంజ్ పరిధి పొట్టంగిపాడొరొ, బొడొడెంగిలెలి అటవీ ప్రాంతాల్లో నాలుగు ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు. ఈ గ్రామాల్లోని పనస, మామిడి, పసుపు, అల్లం పంటలను ఏనుగులు మంగళవారం ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రేంజర్ చందన్ గొమాంగో ఆదేశాల మేరకు అటవీ సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి పరీక్షించగా నాలుగు ఏనుగులు సంచరిస్తున్నట్లు తెలిసింది. ఏనుగులను తరిమేందుకు చర్యలు చేపడుతున్నామని గ్రామస్తులు రాత్రి సమయంలో బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నారు. దీంతా ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న భయాందోళనకు గురవుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీ: బాలిక మృతి



కుమార్తె లిప్సా దలాయ్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

రాయగడ: ఇసుక ట్రాక్టర్ ఢీకొని బాలిక ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన చందిలి పోలీస్‌స్టేషన్ పరిధి కొత్తపేట-కొథొమల్లిగాం ప్రధాన రహదారిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకోగా.. కొంథొమల్లిగాం గ్రామానికి చెందిన లిప్సా దలాయ్ (12) దుర్మరణం చెందింది. విద్యార్థిని లిప్సా దలాయ్ ట్యూషన్ నుంచి ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో కొత్తపేట-కొంథొమల్లిగాం ప్రధాన రహదారి వద్ద ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన బాలికను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదానికి కారణంగా భావిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిప్పిలిలో బీజేడీకి షాక్..!

- స్వతంత్ర అభ్యర్థిగా రుద్ర మహారథి భార్య నామినేషన్

భువనేశ్వర్: పూరీ లోక్‌సభ నియోజకవర్గం పరిధి పిప్పిలి శాసనసభ నియోజకవర్గంలో అధికార బిజూ జనతా దళ్‌కు విచిత్ర పరిస్థితి ఎదురైంది. ఈ నియోజకవర్గం నుంచి బీజేడీ అభ్యర్థిగా రుద్ర మహారథి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి నామినేషన్ దాఖలు చేశారు. అయితే నామినేషన్ దాఖలు గడువు ముగిసే చివరి క్షణంలో ఆయన భార్య జాగృతి పండా స్వతంత్ర అభ్యర్థిగా పిప్పిలి శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీకి నామినేషన్ దాఖలు చేయడం కలకలం రేపింది. బీజేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రుద్ర మహారథి పిప్పిలి నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే. ఆయన దివంగత బీజేడీ నాయకుడు, మాజీ మంత్రి ప్రదీప్ మహారథి కుమారుడు. తండ్రి మరణానంతరం జరిగిన ఉప ఎన్నికలో పోటీచేసి, 2021 సంవత్సరంలో శాసనసభకు ఎన్నికయ్యారు. ఈసారి పూర్తిస్థాయి ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోరుకు దిగిన తరుణంలో ఆయనపై పోటీకి భార్య స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగడం రాజకీయ వాతావరణం అకస్మాతుగా పలు మార్పులకు గురవుతోంది.

పెదవి విప్పని జాగృతి

ఈ పరిస్థితిపై జాగృతి పండా పెదవి కదపకుండా చాకచక్యంగా దాటవేశారు. అలాగే ఆమె భర్త, బీజేడీ అభ్యర్థిగా బరిలో ఉన్న రుద్ర మహారథి దీనిని తేలికగా పరిగణిస్తున్నట్లు హావభావాలు వ్యక్తం చేసి అలజడి నివారించారు. రాష్ట్రంలో ఈసారి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో పలు చోట్ల కుటుంబీకులు పోటీ చేస్తున్నారు. అదే తరహాలో ఇదొకటిగా పరిగణిస్తే తప్పేమి ఉందని పరోక్షంగా వ్యాఖ్యానించారు. జాగృతి పండా నామినేషను దాఖలు వాస్తవ ముఖ చిత్రం కొద్ది రోజుల్లో తేటతెల్లమైపోతుందని విశ్లేషకుల భోగట్టా. పోటీ నుంచి వైదొలిగేందుకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఆమె బరిలో ఉంటే తదుపరి రాజకీయ పరిణామాలపై చర్చ రసవత్తరంగా మారుతుందని ఈ వర్గం అభిప్రాయపడింది. ఆమె భర్తతో తలపడేందుకు చివరివరకు బరిలో కొనసాగుతుందా, లేనిది గురువారంతో తేలిపోతుంది. మొత్తం మీద పిప్పిలి నియోజకవర్గం వైపు అందరి దృష్టి కేంద్రీకృతమైంది. నామినేషను దాఖలు వరకు ఎటువంటి అలికిడి లేకుండా అకస్మాతుగా జాగృతి పండా నామినేషను దాఖలుతో తెరపైకి ఎక్కడం చర్చనీయాంశమైంది. పూరీ పార్లమెంటరీ నియోజకవర్గంలో పిప్పిలి అసెంబ్లీ సెగ్మెంటు అత్యంత కీలకమైనది. ఈ నెల 25న ఈ నియోజకవర్గంలో పోలింగ్ జరగనుంది. జాగృతి పండా ఆరంగేట్రం బీజేడీకి ఊహాతీత పరిణామం. సుమారు మరో 24 గంటల్లో ఆమె తుది నిర్ణయం స్పష్టం కానుంది. ఈ నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మూడుకు చేరిన వడదెబ్బ మృతుల సంఖ్య

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇప్పటివరకు 3 మంది వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ధ్రువీకరించింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 786 వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. విచారణ, సంయుక్త విచారణ మరియు పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇప్పటివరకు వడదెబ్బ కారణంగా మూడు మరణాలు నిర్ధారించబడ్డాయి. మరో 17 కేసులు పరిశీలనలో ఉన్నాయని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ బిజయ్ కుమార్ మహాపాత్రో తెలిపారు. గత రెండు మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తగ్గడంతో పరిస్థితి మెరుగుపడిందని, ప్రస్తుతానికి ఎలాంటి సమస్య లేదని పేర్కొన్నారు.

13 పింక్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



జయపురంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన పింక్ బూత్

జయపురం: ఈ నెల 13 వ తేదీన జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జయపురం మున్సిపాలిటీ పరిధిలో మహిళల కోసం 13 పింక్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జయపురంలో 90 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పింక్ పోలింగ్ కేంద్రాల్లో కేవలం మహిళలు మాత్రం ఓటు వేస్తారని మున్సిపాలిటీ కార్యనిర్వాహక శాఖ అధికారి సిద్ధార్థ పట్నాయక్ బుధవారం వెల్లడించారు. ఈ కేంద్రాల్లో మహిళా సివిల్ అధికారులు, ఉద్యోగులు మాత్రమే ప్రిసైడింగ్, పోలింగ్ సిబ్బందిగా వ్యవహరిస్తారు. ఎన్నికలకు మూడు రోజుల ముందు అన్ని పోలింగ్ బూత్‌లను శుభ్రపరచి అవసరమైన సౌకర్యాలు పరిశీలిస్తామని తెలిపారు. మహిళా ఓటర్లను ప్రోత్సహించేందుకు, ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక బూత్‌ను ఏర్పాటు చేశామన్నారు. అప్పర్ కొలాబ్ ఇరిగేషన్ కాలనీలో గల ఇరిగేషన్ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు బూత్‌లు, పాయిక వీధి ప్రభుత్వ మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో రెండు బూత్‌లు, ప్రభుత్వ సెంట్రల్ ప్రాథమిక పాఠశాలలో రెండు బూత్‌లు, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మూడు, మహారాణీపేట ప్రాథమిక పాఠశాలలో ఒకటి పింక్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆరు పర్యావరణ అనుకూల బూత్‌లను ఏర్పాటు చేశామని, వాటిలో ఇరిగేషన్ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో ఒకటి, జయనగర్ ప్రాథమిక సేవా కేంద్రంలో మూడు, జేఈఎల్‌సీ హైస్కూల్ సెంటర్‌లో రెండు బూత్‌లు ఉంటాయన్నారు. పట్టణంలో గల అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఓటర్లకు తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, తదితర మౌలిక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

- బరంపురం బీజేడీ అభ్యర్థి భారీ రోడ్డు షో
- పాల్గొన్న కార్తికేయ పాండ్యాన్

బరంపురం: ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తోంది. దీంతో అభ్యర్థులు ప్రచారంలో జోరు పెంచారు. ఎన్నికల వేడి నింగిని తాకుతోంది. బరంపురం అసెంబ్లీ నియోజకవర్గం బీజేడీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా డాక్టర్ రమేష్‌చంద్రచావ్ పట్నాయక్ తరపున టీ–5 కార్యదర్శి, రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యక్తిగత కార్యదర్శి కార్తికేయ పాండ్యాన్ బుధవారం బరంపురం నగరంలో నిర్వహించిన భారీ రోడ్డు షోలో పాల్గొన్నారు. ఫస్ట్‌గెట్ జంక్షన్ నుంచి ప్రారంభమైన రోడ్డు షో అస్కా రోడ్, గేట్ బజార్, కార్పొరేషన్ రోడ్డు, గిరిజ జంక్షన్, పాతబస్టాండ్, కోమ్మపల్లి జంక్షన్ మీదుగా లంజిపల్లి స్టేషన్ రోడ్, గుసానినువాగం, బెజ్జిపూర్ మీదుగా సాగింది. కార్తికేయ పాండ్యాన్ ప్రజలకు అభివాదం చేస్తూ ఆకట్టుకున్నారు. డాక్టర్ రమేష్‌చంద్రచావ్ పట్నాయక్‌కు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నగర మేయర్ సంఘమిత్ర దోళాయితో పాటు పలువురు పార్టీ నాయకులు, అధికసంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ఫస్ట్‌గేట్ జంక్షన్ వద్ద రోడ్డు షో



రోడ్డు షోలో బరంపురం బీజేడీ అభ్యర్థి రమేష్ చంద్ర చావ్ పట్నాయక్



రోడ్ షో లో ప్రజలకు అభివాదం చేస్తున్న కార్తికేయ పాండ్యాన్



రోడ్డు షోలో కార్యకర్తల సందడి

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



గంజాయితో పట్టుబడిన అభి బిశాయితో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అబ్కారీ శాఖ సిబ్బంది అరెస్టు చేశారు. అతని నుంచి ఎనిమిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జయపురం అబ్కారి అధికారి శశికాంత దత్ తెలిపిన వివరాల ప్రకారం.. జయపురం సమితి సొండిగూడ గ్రామానికి చెందిన చెందిన అభి బిశాయి అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్నాడు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం చేరింది. దీంతో ఘాట్‌భఘర్ జంక్షన్ వద్ద బుధవారం మాటు వేశారు. అభి బిశాయి ద్విచక్ర వాహనంపై గంజాయిని తీసుకొని సొండిగూడ నుంచి జయపురం వైపు వస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది అతన్ని పట్టుకొని తనిఖీలు చేయగా ఎనిమిది కిలోల గంజాయి లభ్యమంది. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు శశికాంత దత్ తెలిపారు.

కలెక్టర్‌ను వెంటనే బదిలీ చేయాలి



మాట్లాడుతున్న బసంత పండా, పక్కన అభిమన్యు పండా

పర్లాకిమిడి: అధికార బీజేడీ పార్టీకి గజపతి జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బసంత పండా ఆరోపించారు. స్థానిక తెలుగు సోండి వీధి కాంగ్రెస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు సమీక్షా గోమాంగో అనితా దాస్‌లు మోహనా నియోజకవర్గంలో బీజేడీ అభ్యర్థి అంతర్యామి గోమాంగో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని, ఫొటోలతో కలెక్టర్‌కు పంపినా చర్యలు తీసుకోలేదన్నారు. పంచాయతీ కార్యనిర్వాహణ అధికారి జాకబ్ గోమాంగోను కాశీనగర్ నుంచి జిల్లా పంచాయతీ కార్యాలయం హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థితో సి.ఆర్.పి.ఎఫ్ ఉద్యోగి తిరిగితే డిస్మిస్ చేశారన్నారు. పోలింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తినా అందుకు జిల్లా కలెక్టర్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్‌కు ముందే కలెక్టర్‌ను బదిలీ చేయాలని, లేకుంటే కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని బసంత్ పండా అన్నారు. మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ సాధారణ కార్యదర్శి అభిమన్యు పండా పాల్గొన్నారు.

రెండో పెళ్లికి సిద్ధపడిన కొడుకు!

- పోలీసులకు అప్పగించిన తండ్రి



కొడుకుని పోలీసుస్టేషన్‌కు ఈడ్చుకెళ్తున్న తండ్రి

భువనేశ్వర్: ఇంట్లో తాళి కట్టిన ఇల్లాలు ఉండగా మరో మహిళతో రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు ఆ మృగాడు. అయితే దీన్ని తండ్రి అంగీకరించలేదు. కొడుకుని ఈడ్చుకొని తీసుకొని వెళ్లి స్వయంగా పోలీసులకు అప్పగించాడు. భద్రక్ జిల్లాలో చోటు చేసుకున్న ఈ సంఘటన చర్చనీయాంశమైంది. ఠాణాలో పెళ్లి తప్పిన దంపతుల్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. తన కొడుకు అజయ్‌ను రెండో పెళ్లి చేసుకున్నందుకు శిక్షగా ఊరేగింపులో కనిపించిన వద్ధుడు ప్రజల హృదయాలను గెలుచుకున్నాడు. భద్రక్ జిల్లాలోని బాసుదేవ్‌పూర్ ఠాణా పరిధిలోని ఎడ్తాల్ గ్రామస్తుడు అజయ్ మొదటి భార్య ఉంటుండగా చట్టబద్ధంగా కోర్టులో మరో మహిళతో రెండో పెళ్లికి సిద్ధం అయ్యాడు. ఈ విషయం తన కన్న తండ్రి బిష్ణుమోహన్ జెనా చెవిన పడడంతో హుటాహుటిన కొడుకు రెండో పెళ్లి ప్రాంగణానికి చేరి విషయంపై ఆరా తీశాడు. తాను విన్నది నిజమేనని తేలడంతో కోర్టు ఆవరణ నుంచి కన్న కొడుకు చొక్కా కాలరు పట్టుకుని ఈడ్చుకుంటు నడి రోడ్డు గుండా పోలీసు ఠాణాలో హాజరు పరిచాడు. పది సంవత్సరాల కిందట తన కొడుకు అజయ్‌కు వివాహం జరిగిందని.. ఈ దంపతులకు ఎనిమిదేళ్ల కుమారుడు ఉన్నాడని పోలీసులకు వివరించాడు. ఇల్లాలు, బిడ్డ ఉండగా రెండో పెళ్లికి పాల్పడడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన తండ్రి తక్షణ స్పందన అందరి హృదయాల్ని చలింపజేసింది. కోడలు, మనవడుతో కలిసి ఆరోగ్య పరీక్షల కోసం గ్రామంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) వెళ్లిన సమయంలో కొడుకు కోర్టులో అజయ్‌కు రెండో పెళ్లి జరుగుతుందని తండ్రి చెవిన పడింది. తక్షణమే బిష్ణుమోహన్ తన కోడలు, మనవడిని ఇంట్లో వదిలేసి కోర్టుకెళ్లి రెండో పెళ్లికి సిద్ధమవుతున్న కొడుకును చూసి అవాక్కయ్యాడు. ఈ విషయం దాచిపెట్టకుండా తన కొడుకును పోలీసులకు అప్పగించాలని బిష్ణుమోహన్ అప్పటికప్పుడే నిర్ణయించుకున్నాడు. కొడుకును ఈడ్చుకుని పోలీస్ స్టేషకు తీసుకెళ్లాడు. అజయ్‌తో పెళ్లి చేసుకోబోతున్న మహిళ అతనితో పాటు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. విచారణ నిమిత్తం పోలీసులు అజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇంతలో అజయ్ తనను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడని అతని భార్య ఆరోపించింది.

పట్టాలు తప్పిన బీజేడీ పాలన

- ఒడిశాలో రామరాజ్యం తీసుకొస్తాం
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- రాయగడలో ఎన్నికల ప్రచారం



డొంగిరియా కొంధొ యువతులతో రాజ్‌నాథ్ సింగ్



రాజ్‌నాథ్‌సింగ్‌ను గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

రాయగడ: ఎంతో నమ్మకంతో ఒడిశా రాష్ట్ర ప్రజలు బీజేడీ పార్టీని నమ్మారు. వారి అమాయకత్వాన్ని ఆసరగా తీసుకున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సుదీర్ఘకాలం పాటు పరిపాలించారు. అయితే అయన పాలన పట్టాలు తప్పింది. ప్రజలకు సుస్థిర పాలన అందించడం మాట అటుంచితే వారి నమ్మకాలను వమ్ము చేశారని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయన బుధవారం రాయగడకు వచ్చి బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. స్థానిక జీఐఎసీఆర్ మైదానంలో విజయసంకల్ప సమావేశం పేరిట నిర్వహించిన బహిరంగ సభలో అయన మాట్లాడారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని అటు కాంగ్రెస్ పార్టీపై దుమ్మెత్తి పోశారు. ఆర్థిక రంగంలో ఒడిశా రాష్ట్రం చాలా వెనుకబడిందని అన్నారు. గత 25 ఏళ్ల బీజేడీ పాలనలో ప్రజలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఆదివాసీ, హరిజన తెగలకు చెందిన వారి ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రగతి జాడలు కనిపించలేదని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

రాష్ట్రంలో రామరాజ్యం ఖాయం

త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఒడిశా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బీజేపీకి ప్రజలు మద్దతు పలికితే రామరాజ్యం అంటే ఏమిటో చూపిస్తామని చెప్పారు. కేంద్రంలో నరేంద్రమోదీ సర్కార్ మరోసారి అధికార పగ్గాలు చేపట్టనున్న నేపథ్యంలో ఒడిశాలో కూడా బీజేపీ ప్రభుత్వం వస్తే డబల్ ఇంజిన్ సర్కార్ పనితీరు ఎలా ఉంటుందో చూపిస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక, సామాజిక రంగాల్లో పురోగతిని చూపిస్తామని, రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యే శ్రద్ధ కనబరుస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కేలా తగుచర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులే దేశానికి వెన్నెముక అన్న నానుడికి సరైన అర్థాన్ని చూపిస్తామని పేర్కొన్నారు. ఆధునిక, సాంకేతిక పరంగా రాష్ట్రాన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. కొత్త పరిశ్రమలకు బాటలు వేసి నిరుద్యోగ సమస్యను నిర్మూలించేందుకు మార్గాలను అన్వేషిస్తామన్నారు.



బహిరంగ సభకు హాజరైన జనసందోహం

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

అధికార బీజేడీ పాలనలో విసుగెత్తిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. ప్రచార సభలకు ఎక్కడికి వెళ్లినా ప్రజలు గళమెత్తి చెబుతున్నారని అన్నారు. దీనిబట్టి చూస్తే ఈసారి ఒడిశాలో మార్పు అనివార్యంగా కనిపిస్తోందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు.

అగ్రరాజ్యాల్లో భారత్‌కు ప్రత్యేక గౌరవం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోయిందని రాజ్‌నాథ్ అన్నారు. ముఖ్యంగా అగ్రరాజ్యాల్లో భారతదేశం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోగలిగిందని చెప్పారు. ఆర్థిక రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చిందని అన్నారు. పేదరిక నిర్మూలనకు విశేషంగా కృషిచేసినట్టు వివరించారు. సుమారు 25 కోట్ల మంది పేదిరికం నుంచి బయటపడేలా మోదీ సర్కార్ ప్రత్యేక శ్రద్ధను తీసుకుందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేలకు వరాలుగా మారాయన్నారు. సుమారు 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ దేశాన్ని భ్రష్టుపట్టించిందని విమర్శించారు. కాంగ్రెస్ వంటి పాలనకు మద్దతు పలికితే మరో 60 ఏళ్లు దేశం వెనుకబడటం ఖాయమని అన్నారు. ఆధునిక, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న దేశాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలంటే ఈసారి కూడా మోదీసర్కార్ అనివార్యమని చెప్పారు. ప్రజలు దీన్ని గమనించి సరైన నిర్ణయాన్ని తీసుకోవాలని సూచించారు.

కరోనా సమయంలో..

కరోన వంటి విపత్కర సమయంలో దేశం అతలాకుతలం అయిందన్నారు. అయితే ఈ మహమ్మారిని తరిమికొట్టే విషయంలో మన వైజ్ఞానికులు ఎంతో శ్రమించారని కొనియాడారు. మన దేశంలో కనిపెట్టిన కరోన నిరోధక వ్యాక్సిన్లు ఇతర దేశాలకు పంపించడంలో సత్తాచాటుకున్నామన్నారు. మన దేశం వైజ్ఞానిక పరంగా మరింత ముందుకు దూసుకుపోతోందన్నారు. భారతదేశం అంటే ప్రపంచ దేశాల్లో మంచి గుర్తింపును తీసుకువచ్చిన ప్రధాని మోదీని మరోసారి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అందరికీ పక్కా గృహాలు

కూడు, గూడు, గుడ్డ వంటి మౌలిక సౌకర్యాలను ప్రజలకు అందేలా బీజేపీ సర్కార్ ఎన్నో సంస్కరణలను తీసుకువస్తుందని అన్నారు . మరో ఐదేళ్ల పాలనలో అర్హులైన అందరికీ పక్కా గృహాలను నిర్మించి ఇవ్వడమే ధ్యేయమని చెప్పారు. ఈ ఎన్నికల్లో రాయగడ జిల్లాలోని మూడు అసెంబ్లీ, కొరాపుట్ లోక్‌సభ స్థానాలకు బీజేపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు యువకులని వారిని గెలిపించాలని కోరారు.

రాజ్‌నాథ్‌కు ఘన సన్మానం

బహిరంగ సభకు హాజరైన రాజ్‌నాథ్ సింగ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, పార్టీ సీనియర్ నాయకులు గోవింద్ జైన్, కార్యకర్తలు గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాయగడ మజ్జిగౌరి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి పర్యాలిలోని డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీ మహిళలు స్వయంగా రూపొందించిన సాల్‌ను కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌కు అందజేశారు. కేంద్ర మంత్రి వారికి ధన్యవాదాలు తెలియజేసి ఫొటో దిగారు.

కలెక్టర్‌పై ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేస్తాం

- పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, ఛిత్రి సింహాద్రి, పృథ్వీరాజ్ చౌహాన్

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టర్ అధికార పార్టీ బీజేడీ అభ్యర్థికి కొమ్ముకాస్తూ ఈ ఎన్నికల్లో పక్షపాతి వైఖరి అవలంభిస్తున్నారని, దీనిపై ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని పర్లాకిమిడి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోడూరు నారాయణరావు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాశీనగర్‌లో బీజేడీ పార్టీ అభ్యర్థితో పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి జాకబ్ గోమాంగో తిరుగుతుండటంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఆయనను జిల్లా పంచాయతీ కార్యాలయానికి తరలించారన్నారు. జాకబ్ గోమాంగో గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమీ గోమాంగో భర్త కావడంతో కలెక్టర్ అనుకూలంగా మార్చుకున్నారన్నారు. గుసాని సమితి పాటికోట పంచాయతీ సెక్రటరీ అడపా వెంకటరావు కూడా బహిరంగంగా బీజేడీ అభ్యర్థితో కలిసి ప్రచారం చేస్తున్నా.. కలెక్టర్ ఎటువంటి ఎన్నికల క్రమశిక్షణ చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. పర్లాకిమిడిలో పలువురు డీలర్లు జమ్మిదార్ పట్నాయక్ తదితరులు ఎన్నికల్లో బీజేడీ తరఫున బహిరంగంగా ప్రచారం చేస్తున్నారన్నారు. మంగళవారం గజపతి స్టేడియానికి అనధికారంగా ఒక హెలికాప్టర్‌తో డబ్బు సంచులు వచ్చినట్టు సమాచారం ఉందని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. న్యాయవాది, బీజేపీ ప్రతినిధి పృథ్వీరాజ్ చౌహాన్, ఛిత్రి సింహాద్రి పాల్గొన్నారు.

ప్రచార జోరు..



ఎంవీ 81 గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బిప్లబ్ కుమార్ దేవ్

మల్కన్‌గిరి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో త్రిపుర మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. కలిమెల సమితి యం.వి 79, యం.వి 65, యం.పి.వి 81తో పలు గ్రామాల్లో బీజేపీ ఎమ్మెల్యే నర్సంగ్ మడ్కమికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. 25 ఏళ్లలో బీజేడీ ఇక్కడ ప్రజలకు అన్యాయం చేసిందన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పర్లాకిమిడి మహారాజా బాలుర ఉన్నత పాఠశాల వద్ద క్యూకట్టిన ఉద్యోగులు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉద్యోగులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో బరంపురం పార్లమెంటరీ స్థానం, పర్లాకిమిడి, మోహనా అసెంబ్లీ స్థానాలకు పోస్టల్ బ్యాలట్‌ను జిల్లాలోని ఉద్యోగులందరూ ఉపయోగించుకున్నారు. స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాల, ఎస్.కె.సి.జి కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలట్ కోసం క్యూ కట్టారు. బుధవారంతో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ముగిసిందని ఎన్నికల అధికారులు తెలియజేశారు.



పోస్టల్ బ్యాలట్ కోసం క్యూలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు

మండిబిసిలో బీజేడీ ఎన్నికల ప్రచారం



నెక్కంటికి స్వాగతం పలుకుతున్న మహిళలు



అనసూయను గెలిపించాలని గ్రామస్తులను కోరుతున్న నెక్కంటి

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ సమితి మండిబిసి ప్రాంతంలో బీజేడీ పార్టీ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నెక్కంటి భాస్కరరావు నేతృత్వంలో రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అనసూయా మాఝి ప్రచారంలో పాల్గొన్నారు. మండిబిసి గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. ప్రతీ గ్రామంలో నెక్కంటికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈసారి ఎన్నికల్లో తమ మద్దతు తప్పకుండా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బీజేడీ విజయం ఖాయం

- బీజేపీ కుతంత్రాలు పనిచేయవు
- పార్టీ 5టీ ఛైర్మన్ వి.కె.పాండ్యన్



మాట్లాడుతున్న వి.కె.పాండ్యన్


భువనేశ్వర్: రానున్న ఎన్నికల్లో బిజూ జనతా దళ్ క్లీన్ స్వీప్ చేయనుందని ఆ పార్టీ వ్యూహకర్త, 5టీ ఛైర్మన్ వి.కె.పాండ్యన్ బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఎన్నికల తర్వాత చీలిక సూత్రంతో బీజేడీలో వైరి భావాల్ని భారతీయ జనతా పార్టీ ప్రేరేపిస్తోందని భవిష్యత్ కుతంత్రం గూర్చి వివరించారు. అతి తక్కువగా 60 శాసన సభ స్థానాల్లో అభ్యర్థులను బరిలో దింపేందుకు బీజేపీ నానా తంటాలు పడుతోందన్నారు. ఎన్నికల్లో గెలవడం ఆ పార్టీ ధ్యేయం కాదని, రాష్ట్రంలో 50 నుంచి 60 సీట్లు గెలవడం కోసం ఆరాటపడుతుందన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటకలలో ఇతర పార్టీలతో చేసిన విధంగా వారు బిజూ జనతా దళ్‌ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించే అవకాశం ఉందన్నారు. ఇది వారు అంతర్గతంగా పన్నుతున్న వ్యూహమన్నారు. బీజేపీ జాతీయ నాయకులు వరుసగా 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో ప్రచారం చేశారని, వారి ప్రచారం ఎన్నికల ఫలితాలపై పెద్దగా ప్రభావం చూపలేదన్నారు. ఒడిశా ప్రజలు నవీన్ పట్నాయక్‌ను ఎక్కువగా విశ్వసించారన్నారు. ప్రత్యర్థులకు రాష్ట్ర ప్రజలు గతంలో తగిన సమాధానం ఇచ్చారన్నారు. ఓ వైపు నవీన్ పట్నాయక్ ... మరో వైపు విపక్షాల భారీ సైన్యం ఉందని, ఈసారి కూడా అవే ఫలితాలు ఉంటాయన్నారు. జూన్ 9న వరుసగా 6వ సారి ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్ ప్రమాణ స్వీకారం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. తొమ్మిది మంది చొప్పున లోక్ సభ అభ్యర్థులను ప్రకటించిన పార్టీకి 9వ సంఖ్య ప్రాముఖ్యతను అయన వెల్లడించారు. ఇది మూఢనమ్మకం కాదు, గ్రంథాల ఆధారంగా, హిందూ మతంలో 9కి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి మీరు గూగుల్ చేయవచ్చని సూచించారు. ఈ ప్రయత్నం నవీన్ పట్నాయక్‌కు మరింత బలంగా ఆశీర్వదించి పట్టం కడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13న ఒడిశాలో జరిగే తొలి రౌండ్ ఎన్నికల్లో పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందన్నారు. అలాగే తన బలం మరింత మెరుగుపరుచుకోనుందన్నారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో కాంగ్రెస్‌తో పోరు జోరుగా ఉంటుందని, కలహండిలో 2 నుంచి 3 అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ కొంత ఉనికిని చాటుకుంటుందన్నారు. ముఖ్యమంత్రిపై ప్రజలకు అపారమైన విశ్వాసం, అమితమైన ప్రేమ ఉన్నందున గంజాంలో ఏకపక్ష పోరుకు సాక్షిగా బీజేడీ నిలుస్తుందన్నారు. సమగ్రంగా రాష్ట్రంలో జరగనున్న నాలుగు రౌండ్లలో బీజేడీ క్లీన్ స్వీప్ చేస్తుందని జోష్యం చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు - 2024 బిజూ జనతా దళ్ ప్రచారానికి నవీన్ పట్నాయక్ నాయకత్వం వహిస్తున్నారని, మేమంతా అతని జట్టులో ఉన్నామని, ఒడిశాను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడానికి పోరాడుతున్నామన్నారు. కొందరు ముందంజలో, ఇంకొందరు మధ్యలో, మరికొందరు వెనుకవైపు ఉంటూ సార్వత్రిక ఎన్నికల ఆటలో ఆద్యంతం ధీటైన పోటీకి నిలిచి తుది ఫలితాల్లో విజేతగా నిలుస్తామని తెలిపారు. ఈ ఆటలో అట్టడుగు కార్యకర్తతో సహా ప్రతి ఆటగాడు ముఖ్యమేనని పేర్కొన్నారు.

అధికారంలోకి వస్తే ధాన్యానికి మద్దతు ధర

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయి
- కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో ఎన్నికల ప్రచారం



లక్ష్మీపూర్‌లో ప్రచారం చేస్తున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిరణ్‌దేవ్



ఉమ్మర్‌లో ప్రచారం చేస్తున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి

కొరాపుట్: ఒడిశా రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ధాన్యానికి మద్దతు ధర ప్రకటిస్తామని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు. కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల తరఫున ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ముఖ్య నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని హతబరండి బహిరంగ సభలో ప్రసంగించారు. తమ పార్టీ ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే క్వింటా ధాన్యానికి రూ. 3,100 మద్దతు ధర ప్రకటించామన్నారు. ఒడిశాలో కూడా అధికారం ఇస్తే వెంటనే అదే మద్దతు ధర ఇస్తామని ప్రకటించా. అనంతరం కొరాపుట్ జిల్లా కుంద్రాలో పర్యటించారు. బీజేపి నబరంగ్‌పూర్ లోక్ సభ అభ్యర్థి బలభద్ర మజ్జి, ఉమ్మర్‌కోట్ అసెంబ్లీ అభ్యర్థి నిత్యానంద గొండోలను కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఛతీస్‌గఢ్ రాష్ట్ర బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌దేవ్ కొరాపుట్ జిల్లాలో రోడ్ షోలో పాల్గొన్నారు. కొట్‌పాడ్, లక్ష్మీపూర్, పుడాఘుడ్‌లలో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు.

ఘనంగా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం



జయపురం: హెనరీ దునాండ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జూనియర్ రెడ్‌క్రాస్ బృందం

జయపురం: ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుదవారం ఘనంగా నిర్వహించారు. విద్యాలయ జూనియర్ రెడ్‌క్రాస్ జయపురం శాఖ నిర్వహించిన ఈ ఉత్సవానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రకాశ్ చంద్ర పట్నాయక్ అధ్యక్షత వహించారు. ఈ ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవంలో జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి యజ్ఞేశ్వర పండ ముఖ్య వక్తగా పాల్గొని రెడ్‌క్రాస్ పితామహుడు హెనరీ డునాండ్ జీవనాన్ని, రెడ్‌క్రాస్ ఏర్పాటు ప్రధాన లక్ష్యాలను తెలియజేశారు. మన దేశంలోనే కాకుండా ప్రపంచంలో నిస్సహాయులకు, ప్రకృతి విపత్తులలో బాధితులకు అందిస్తున్న సేవలను వివరించారు. జూనియర్ రెడ్‌క్రాస్ పరామర్శదాత శుభలక్ష్మీ సాహు మాట్లాడుతూ జూనియర్ రెడ్‌క్రాస్, రెడ్‌క్రాస్‌ల ప్రధాన లక్ష్యాలను, ఆశయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హరిహర చరడి, సొంబురు జాని, డుంబురు జాని, క్షీరసింధు సాహు, మహవీర ప్రధాన్ తదితరులు ప్రసంగించారు. పాఠశాల ప్రాంగణంలో గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెడ్ క్రాస్ పితామహుడు హెనరీ డునాండ్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి కాలేజీలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అటవి సంరక్షణాధికారి మన్సున్ భేముండు హాజరయ్యారు. ఈ రెడ్‌క్రాస్ సంస్థ ఎంతోమంది ప్రాణాలు కాపడిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్, మల్కన్‌గిరి కాలేజ్ ప్రిన్సిపాల్ లింగరాజ్ మిశ్రో, ఆశోక్ సోడాంగి, తదితరులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: సమావేశంలో పాల్గొన్న అతిథులు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భోగాపురం: మండలంలోని అమటాం రావివలస పంచాయతీ దల్లిపేట గ్రామానికి చెందిన దల్లి అప్పలరాములు (60) విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు హెచ్‌సీ పీవీఎస్ఎన్ఎన్ మూర్తి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దల్లిపేటకు చెందిన దల్లి అప్పలరాములు భార్య ఏడాది కిందట అనారోగ్యంతో చనిపోయింది. ఉన్న ఇద్దరు కుమారులు బతుకుదెరువు కోసం విశాఖపట్నం వెళ్లిపోయారు. అప్పటినుంచి మద్యానికి బానిసైన అప్పలరాములు మంగళవారం ఉదయం అనుకోకుండా ఫినాయిల్ తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ సమయంలో ఇంటికి వచ్చిన ఆయన చెల్లి నరసయ్యమ్మ అన్న పరిస్థితి చూసి స్థానికుల సహాయంతో విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు దల్లి ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీవీఎస్ఎన్ఎన్ మూర్తి తెలిపారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



హైజెనిక్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

గరుగుబిల్లి: ప్రజలు ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇందుకు అనుగుణంగా పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన గరుగుబిల్లి మండలంలోని తోటపల్లిలో సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. అలాగే రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలు, రైతులకు హైజెనిక్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపాలని కోరారు. ప్రకృతి వ్యసాయం వల్ల వ్యవసాయ ఖర్చులు తగ్గడంతోపాటు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు తయారవుతాయన్నారు. దీనివల్ల ప్రజలకు రోగాల బారినుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా ప్రజలకు వివిధ రకాల సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ మంచిపల్లి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ కౌన్సిలర్



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ కౌన్సిలర్ తాతపూడి వెంకట్రావు

పార్వతీపురం టౌన్: కొన్ని సంవత్సరాలుగా టీడీపీకి సేవలు అందిస్తూ పార్వతీపురం పట్టణంలోని 17వ వార్డు టీడీపీ కౌన్సిలర్‌గా పనిచేసిన తాతపూడి వెంకట్రావు బుధవారం వైఎ స్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో పాటు బొత్స దుర్గ(సుబ్బు), పతివాడ మురళి, పతి వాడ శ్రీనులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిగతా తమ అనుచరులతో మాట్లాడి 17వ వార్డులో టీడీపీకి కార్యకర్త లేకుండా ప్రతి ఒక్కరిని వైఎ స్సార్‌సీపీలో చేర్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వారందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే జోగారావు హామీ ఇచ్చారు.

పాలిసెట్- 2024 ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

- జిల్లా ఉత్తీర్ణత శాతం: 87.68
- బాలికలు 90.35 శాతం, బాలురు 85.84 శాతం ఉత్తీర్ణత

విజయనగరం రూరల్: పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 87.68 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత నెల 27న జిల్లా వ్యాప్తంగా 24 కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు రికార్డు స్థాయిలో 7,786 మంది హాజరుకాగా బుధవారం ప్రకటించిన ప్రవేశ పరీక్షా ఫలితాల్లో 6,827 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వరుసగా మూడో ఏడాది ఉత్తీర్ణత శాతంలో బాలికలే పైచేయి సాధించి సత్తాచాటారు. ఈ ఏడాది ప్రవేశ పరీక్షకు 4,604 మంది బాలురు హాజరుకాగా, 85.84 శాతంతో 3,952 మంది ఉత్తీర్ణత సాధించగా, బాలికల్లో 3182 మంది హాజరై 90.35 శాతంతో 2,875 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన వడ్డి త్రినయిణి రాష్ట్ర స్థాయిలో 155 ర్యాంకు, టీవీఎస్ శ్రీనిథ్‌అపూర్వ్‌కు జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 272 ర్యాంకు, తొత్తడి శైలేష్ జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 285వ ర్యాంకు సాధించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పాలిసెట్ ఫలితాలను పీహెచ్‌ఎల్‌వైసీఈటీఏపీ.ఎన్ఐసీ.ఐఎన్, ఎంఎఎన్ఏబీఏడీఐ.సీవో.ఐఎన్ (మనబడి) వెబ్‌సైట్‌లలో పరిశీలించుకోవచ్చని జిల్లా కన్వీనర్, ఎంఆర్ఏజీఆర్ విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.ఆశారమణి తెలిపారు.

వైద్య రంగంలో నవశకం..



లేబొరేటరీలో వైద్య పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

- సర్వజన ఆస్పత్రిలో కళాశాల ఏర్పాటుతో సంపూర్ణ సేవలు
- రోగుల ప్రాణాలకు దక్కిన భరోసా
- అత్యవసర వైద్యం సర్వజన ఆస్పత్రిలోనే..
- తగ్గిన రిఫరల్స్
- పెరిగిన ఓపీ, ఐపీ సేవలు
- సర్వజన ఆస్పత్రిపై ప్రజల్లో పెరిగిన నమ్మకం



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్: పక్క ఫొటోలో కనిపిస్తున్న యువకుడు పేరు ఇమంది భరత్. కొద్ది రోజుల కిందట కోమాలో వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చేరిన సమయంలో బతకడం కష్టమని తల్లిదండ్రులు సైతం భావించారు. అయితే ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు అతనికి వెంటిలేటర్‌పై మెరుగైన వైద్యం అందించడంతో పూర్తి ఆరోగ్యవంతుడుగా కోలుకున్నాడు.



దంత సమస్యతో వచ్చిన రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు



చికిత్స అనంతరం కోలుకున్న భరత్



ఆస్పత్రిలో చేరినప్పుడు భరత్

గతం కంటే మెరుగు..

జిల్లా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం విశాఖపట్నం కేజీజిహెచ్‌కు పరుగులు తీసేవారు. కొంతమందిని కేజీహెచ్‌కు తీసుకెళ్లేలోపే మృత్యువాత పడేవారు. అత్యవసర వైద్యం అందించలేక.. తమ వారిని కాపాడుకోలేక కుటుంబ సభ్యులు నరకయాతన పడేవారు. జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటైతే మెరుగైన వైద్యం అందుతుందని ప్రజలు భావించేవారు. కళాశాల ఏర్పాటు కోసం దశాబ్దాల తరబడి ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో 2019లో అధికారం చేపట్టిన సీఎం జగన్ మోహన్ రెడ్డి జిల్లా ప్రజల చిరకాల వాంఛను నేరవేర్చుతూ ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేశారు. మంజూరు చేయడమే కాకుండా వైద్య కళాశాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్థానిక జిల్లా ఆస్పత్రికి వైద్య కళాశాల మంజూరు కావడంతో సౌకర్యాలు, వసతులు మెరుగుపడడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా రూపుదిద్దుకుంది. అన్ని విభాగాల స్పెషాలిటీ వైద్యులు అందుబాటులోకి రావడంతో సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. శస్త్రచికిత్సలు కూడా సకాలంలో జరుగుతుండడంతో ఆస్పత్రిపై ప్రజల్లో నమ్మకం పెరిగింది.

ఏడాదికి సుమారు 3.70 లక్షల మందికి సేవలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏడాదికి సుమారు 3.70 లక్షల మంది వరకు రోగులకు సేవలు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్లుగా చేరిన సుమారు 45 వేల మందికి సేవలు అందిస్తున్నారు. అలాగే సుమారుగా ఐదు వేల మేజర్ ఆపరేషన్లు, 17 వేల మందికి మైనర్ ఆపరేషన్లు, 20 వేల అల్ట్రాసౌండ్ స్కాన్‌లు, 21 వేల ఎక్స్‌రేలు 5 లక్షల ల్యాబ్ టెస్టులు, ఎనిమిది వేల ప్రసవాలు చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు

జిల్లా ఆస్పత్రిగా ఉన్నప్పుడు సివిల్ అసిస్టెంట్ సర్జన్, సివిల్ సర్జన్లు రోగులకు వైద్య సేవలు అందించేవారు . ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారిన తర్వాత ప్రొఫెసర్లు, అసోసియేసిట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రోగులకు సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో కార్పొరేట్ తరహాలో చికిత్స అందుతోంది. సూపర్ స్పెషాలిటీ సేవలు మినహా అన్ని సేవలు అందుతున్నాయి. అన్ని విభాగాల్లో నలుగురు నుంచి పది మంది వరకు వైద్యులు ఉండడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకపోయింది..

2019 నుంచి ఇప్పటి వరకు అందించిన వైద్య సేవలు వివరాలు			
సంవత్సరం	ఓపీ	ఐ.పి.	వైద్య పరీక్షలు
2019	3,47,651	45,632	5,05,688
2020	1,96,533	32,227	2,76,847
2021	3,23,491	38,350	4,15,143
2022	3,74711	39,918	5,97,699
2023	3,74,132	31,258	6,40,567

ఆస్పత్రిలో విభాగాలు..

ఆస్పత్రిలో ఈఎన్‌టీ, డెంటల్ , ఎస్‌సీడీ, ఏఆర్‌టీ, కంటి, చర్మవ్యాధులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, న్యూరో సర్జరీ, న్యూరో ఫిజిషీయన్, పల్మనాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫోరెన్సిక్, బయోకెమిస్ట్రీ వంటి విభాగాలు ఉన్నాయి. అదేవిధంగా డిజిటల్ ఎక్సరే, ఈసీజీ, సిటిస్కాన్, ఎంఆర్ఐ స్కాన్ , 2డీ ఎకో సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల వైద్య పరీక్షలు చేసే లేబరేటరీ ఉంది. ఇందులో క్యాన్సర్ నిర్ధారణ ఎఫ్ఎన్ఏసీ వంటి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.

సేవలు బాగున్నాయ్..



బీపీ ఉందని సర్వజన ఆస్పత్రికి వెళ్లాను. వైద్యులు బాగా పరీక్షించి మందులు అందజేశారు. ఆప్యాయంగా మాట్లాడారు. గతంలో కంటే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.
– పి. దేముడు, పెదవేమలి గ్రామం

అత్యవసర కేసులకూ వైద్యం..

జిల్లా ఆస్పత్రిగా ఉన్నప్పుడు ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు ఎక్కువుగా రిఫరల్స్ వెళ్లేవి. సర్వజన ఆస్పత్రి అయిన తర్వాత చాలా రిఫరల్స్ తగ్గాయి. ఇక్కడ సౌకర్యం లేని వాటిని మాత్రమే రిఫర్ చేస్తున్నారు. మిగతా అత్యవసర కేసులకు ఇక్కడే సేవలు అందిస్తున్నారు. గతంలో పాము కరిచినా, విషయం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నా కేజీహెచ్‌కు రిఫర్ చేసేవారు. ప్రస్తుతం వెంటిలేటర్‌తో కూడిన ఐసీయూ సౌకర్యం ఉండడంతో ఇప్పుడు అటువంటి కేసులకు సర్వజన ఆస్పత్రిలోనే సేవలు అందిస్తున్నారు. అదేవిధంగా పల్మనాలజీ, న్యూరో, నెఫ్రాలజీ వంటి సేవలు కూడా కళాశాల ఏర్పాటు వల్ల ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

- ఎస్పీ ఎం. దీపిక

భోగాపురం: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఎం. దీపిక హెచ్చరించారు. ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని ముక్కాంలో ఆమె వివిధ పార్టీలకు చెందిన నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటర్లను ఎవరైనా ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. తప్పుడు సమాచారాన్ని సామాజిక మధ్యమాల ద్వారా వ్యాప్తి చేయరాదని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్. గోవిందరావు, సీఐ రవికుమార్, ఎస్సైలు సూర్యకుమారి, తాతారావు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- మూడువేల మందితో పటిష్ట బందోబస్తు
- పోలింగ్ రోజున 144 సెక్షన్ అమలు
- ఎస్పీ ఎం.దీపిక



విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. మే 13న నిర్వహించే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పోలీస్ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా 1015 గ్రామాల్లో ఎన్నికల మీటింగ్‌లు నిర్వహించి, ఎన్నికల నిబంధనలు, పాటించాల్సిన విధి, విధానాలపై అవగాహన కల్పించామన్నారు. కేంద్ర పోలీస్ బలగాలు, స్థానిక పోలీసులు, ఉన్నతాధికారులు ఇప్పటికే 149 గ్రామాలను సందర్శించారని, ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించి, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పించామన్నారు. పోలింగ్ అనంతరం సంబంధిత పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను, ఎన్నికల మెటీరియల్‌ను సురక్షితంగా చేర్చాలన్నారు. జేఎన్‌టీయూ, లెండి ఇంజినీరింగ్ కళాశాలల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ రోజున పార్టీ అభ్యర్థులు పాటించాల్సిన విధి, విధానాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో మాత్రమే పార్టీ కార్యకర్తలు ఉండేలా, ఎటువంటి పార్టీ జెండాలు, గుర్తులు ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు.

పోలింగ్ రోజున 144 సెక్షన్ అమలు

పోలింగ్ రోజున 144 సీఆర్‌పీసీ అమల్లో ఉన్న కారణంగా ఇద్దరు కంటే ఎక్కువమంది గుంపుగా ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలు ప్రతీ ఒక్కరూ పాటించేలా చూడాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత కూడా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, వివాదాలు చెలరేగకుండా గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు సుమారు మూడువేల మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. సమావేశంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు కేకేవీ విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, ఎం.శ్రీనివాసరావు, రవికుమార్, ఎస్.వి.ప్రభాకర్, బి.వెంకటరావు, కె.రామారావు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుర్ల: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలాజీలో డిప్లమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఆర్.వి. మురళీ కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి, తిరుపతిలోని కాలేజీలకు జూన్1లోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్: 93999 36872, 98661 69908 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆదివాసీలకు కార్పొరేట్ వైద్యం



నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

- ఏరియా ఆస్పత్రిగా సామాజిక ఆస్పత్రి అప్‌గ్రేడేషన్
- రూ.19 కోట్లతో అదనపు భవనాల నిర్మాణం
- అందుబాటులో స్పెషలిస్టు డాక్టర్లు
- ఎక్స్‌రే, స్కానింగ్ ఏర్పాటు
- నెలకు 100 నుంచి 120 ప్రసవాలు
- 37 ఆక్సిజన్ బెడ్‌లు ఏర్పాటు
- రూ.50 కోట్లతో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం

సీతంపేట:

టీడీపీ ప్రభుత్వం హయాంలో గగనమైన వైద్య సేవలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మెరుగుపడ్డాయి. సీతంపేటలోని సామాజిక ఆస్పత్రిని పట్టించుకోకుండా అప్పటి ప్రభుత్వం గాలికి వదిలేయగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చొరవతో రూ.19 కోట్లతో అదనపు భవనాల నిర్మాణం చేపట్టారు. సీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రిగా మార్పు చేశారు. రూ.50 కోట్లతో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తున్నారు. ఉన్న పీహెచ్‌సీలను నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేశారు. ఆదివాసీలకు కార్పొరేట్ తరహా వైద్యం అందివ్వాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి అనుగుణంగా ఇక్కడ వైద్య సేవలు అందుతున్నాయి. స్థానికంగా మల్టీసూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పూర్తయి ప్రారంభిస్తే పాలకొండ, భామిని, వీరఘట్టం, సీతంపేట అలాగే ఒడిశా సరిహద్దున ఉన్న గ్రామాలతో పాటు శ్రీకాకుళం జిల్లా పరిధిలోని కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి, పాతపట్నం తదితర మండలాల గిరిజనుల వైద్యసేవలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే స్థానిక ఏరియా ఆస్పత్రిలోని ఒక విభాగంలో పనులు పూర్తయ్యాయి. ఈ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉండడంతో సీతంపేటతో పాటు ఇతర మండలాల నుంచి రోగుల తాకిడి పెరిగింది.



ఏరియా ఆస్పత్రిలో రోగికి సేవలు అందిస్తున్న వైద్యులు



ఎక్స్‌రే యూనిట్


ఆరోగ్యశ్రీ సేవలు..

ఆరోగ్యశ్రీ ఎంప్యానల్‌మెంట్‌లో సీతంపేట ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలో మూడో స్థానం దక్కించుకుంది. ఆరోగ్యశ్రీలో కొత్తగా ఈఎన్‌టీ, ఆర్థో శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. వార్డులో 37 ఆక్సిజన్ బెడ్లు ఏర్పాటు చేశారు. అలాగే ఎక్స్‌రే, గైనిక్ స్కానింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల రక్తపరీక్షలు ఇక్కడే చేస్తున్నారు. మందులన్నీ అందుబాటులో ఉన్నాయి. జనరల్ మెడిసిన్, గైనిక్, ఈఎన్‌టీ,ఆర్థో, పిడియాట్రిక్, డెంటిస్ట్ సేవలకు వైద్యాధికారులు ఉన్నారు. రెగ్యులర్ సిబ్బంది 28 మంది, కాంట్రాక్ట్ సిబ్బంది 20 మంది, అవుట్ సోర్సింగ్‌లో 16 మంది పనిచేస్తున్నారు. నెలకు 100 నుంచి 120 వరకు ప్రసవాలు ఆస్పత్రిలోనే జరుగుతున్నాయి.

శిశువులకు ఎస్ఎన్‌సీయూ..

స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ద్వారా అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు ప్రత్యేక వైద్యం అందుతోంది. ఫొటోథెరపీ, సీప్యాప్, వార్మర్లు, వెంటిలేటర్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. పోషకాహార లోపం కలిగిన చిన్నారులకు న్యూట్రిషియన్ రిహ్యాబిలిటేషన్ సెంటర్ ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులను ఇక్కడ చేర్పించి సరైన పోషకాహారం ఇవ్వడం ద్వారా పిల్లలకు ఆరోగ్యాన్ని అందజేస్తున్నారు. అలాగే ఈ ఆస్పత్రిలో ఫిజియోథెరఫీ యూనిట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా అవసరమైన సేవలు అందుతున్నాయి.

గిరిజనుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



గిరిజనుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. గతంలో కంటే వైద్యసేవలు పూర్తిగా అందుబాటులోకి వచ్చాయి. రిఫరల్ కేసులు కూడా లేవు. అందరు డాక్టర్లు అందుబాటులో ఉన్నారు.
–ఎస్.కాంతారావు, గిరిజన నాయకుడు, దేవనాపురం

సక్రమంగా వైద్యసేవలు



మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందుతున్నాయి. ఏరియా ఆస్పత్రికి వచ్చిన వెంటనే స్పందిస్తున్నారు. –ఎస్.సరోజిని, రాజన్నగూడ



సీతంపేటలోని ఏరియా ఆసుపత్రి




ఏరియా ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణం

రావాలి జగన్.. కావాలి జగన్..



రింగ్ రోడ్డు వద్ద బైక్ ర్యాలీ



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- నినాదాలతో హోరెత్తిన విజయనగరం
- వైఎస్సార్‌సీపీ మహిళా బైక్ ర్యాలీకి అనూహ్య స్పందన
- చంద్రబాబు నీచ రాజకీయాలకు చరమగీతం పాడండి: డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గం ఆధ్వర్యంలో తలపెట్టిన బైక్ ర్యాలీకి అనూహ్య స్పందన లభించింది. మరో నాలుగు రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ర్యాలీలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా నినాదాలు చేశారు. మహిళలు చేపట్టిన ర్యాలీతో ప్రధాన రహదారులు జనసంద్రంగా మారాయి. జై జగన్.. జైజై జగన్.. రావాలి జగన్.. కావాలి జగన్ వంటి నినాదాలు హోరెత్తాయి. కోలగట్ల వీరభద్రస్వామి నివాసం నుంచి ప్రారంభమైన మహిళా బైక్ ర్యాలీ ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, కోట జంక్షన్, దాసన్నపేట, ఖాదర్‌నగర్, ప్రేమ సమాజం, మూడు లాంతర్లు, కన్యకా పరమేశ్వరి ఆలయం, సీఎంఆర్ జంక్షన్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేడ్కర్ జంక్షన్ మీదుగా కోలగట్ల నివాసానికి చేరింది. బైక్ ర్యాలీని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోలగట్ల వీరభద్ర స్వామితోనే సాధ్యమని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ, అభివృద్ధి పాలన సాగుతోందన్నారు. ఎన్నికల హామీలు శతశాతం అమలు చేశారని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమ పాలన చూసి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు అక్కసుతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు చేస్తున్న నీచ రాజకీయాలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు కృషి చేసిన జగన్ మోహన్‌రెడ్డికి రెండు ఓట్లను రాఖీలుగా భావించి బహుమతిగా ఇస్తామని తెలిపారు. ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ శశిభార్గవి, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ లెంక వరలక్ష్మి, బీసీ నాయకురాలు గదుల సత్యలత, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు , మహిళ నాయకులు, కార్యకర్తలు, కోలగట్ల అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫెసిలిటేషన్ కేంద్రాల పరిశీలన



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. జేఎన్‌టీయూ విజయనగరం గురజాడ (జీవీ) యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రెండు ఫెసిలిటేషన్ కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఓటింగ్ ప్రక్రియ, ఏర్పాట్లను పరిశీలించారు. వీలైనంత వేగంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.సందీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, మెప్మా పీడీ సుధాకరరావు, మున్సిపల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

రిసెప్షన్ సెంటర్ వద్ద పటిష్ట ఏర్పాట్లు

ఎన్నికల రోజు ఏర్పాటు చేసే రిసెప్షన్ సెంటర్ వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వేదిక ఇన్‌చార్జ్‌లను కలెక్టర్ ఆదేశించారు. పటిష్టంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటర్ల వద్ద, ప్రాంగణంలో లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యటనలో వేదిక ఇన్‌చార్జ్‌లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సజావుగా ఏపీ ఈసెట్



విద్యార్థుల హాల్ టిక్కెట్లు శివానీలో పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈసెట్–2024 ఆన్‌లైన్ పరీక్ష బుధవారం సజావుగా జరిగింది. చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి షిఫ్ట్‌లో 100కి 90 మంది, రెండో షిఫ్ట్‌లో 100 కి 99 మంది, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 100 కి 98, రెండో షిఫ్ట్‌లో 100 కి 95 మంది హాజరయ్యారు. మొత్తం 400 మందికి రెండు పరీక్ష కేంద్రాలను కేటాయించగా, 382 మంది హాజరయ్యారు. ప్రత్యేక పరిశీలకులు పరీక్ష పర్యవేక్షించారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు



సవరకుద్దబ గ్రామంలో సారా ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని సవర కుద్దబ గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సమన్వయంతో బుధవారం సారా తయారీ స్థావరాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో 1100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటు సారాని స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిపై కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం ఎస్ఈబీ జేడీ గంగాధరం సూచనల మేరకు దాడులు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పలాస డీటీఎఫ్ సీఐ, రామచంద్ర కుమార్, టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడు, పలువురు సిబ్బంది ఉన్నారు.

వసూల్ రాజాలు పీక్కుతిన్నారు..!



- టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల దందా
- ఇల్లు మంజూరుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు, అంగన్‌వాడీ పోస్టులకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు
- ప్రతి పనికీ డబ్బు ఇవ్వాల్సిన పరిస్థితి

ఉపాధి హామీ పథకంలోనూ బినామీ మస్టర్ల పేరిట దోపిడీ

వలసలు నివారించి పేదలకు ఉపాధి కల్పించడనికి ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని టీడీపీ నేతలు వదల్లేదు. బినామీ మస్టర్ల పేరిట భారీ దోపిడీకి పాల్పడ్డారు. పనికి వెళ్లకపోయినా నేతల కుటుంబసభ్యుల పేర్లతో మస్టర్లు వేసుకుని అధిక మొత్తంలో బొక్కేసినట్లు ఆరోపణలు వినిపించాయి.

గంట్యాడ:

గంట్యాడ మండలంలోని ఓ గ్రామంలో ఇల్లు మంజూరుకు ఓ మహిళా లబ్ధిదారును జన్మభూమి కమిటీ మెంబర్ రూ.20 వేలు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు ఇస్తేనే ఇల్లు మంజూరవుతుంది. లేదంటే లేదని తెగేసి చెప్పేశాడు. దీంతో చేసేది లేక ఆ లబ్ధిదారు అడిగినంత ఇచ్చేసింది.

☛ బొండపల్లి మండలంలో అంగన్‌వాడీ పోస్టు నిమిత్తం ఓ మహిళ దగ్గర రూ.3 లక్షలు డిమాండ్ చేశారు. డబ్బులిస్తే పోస్టు మంజూరు చేస్తామని చెప్పడంతో చేసేది లేక అడిగినంత ఆమె కూడా ఇచ్చేసింది.

☛ గంట్యాడ మండలంలో ట్రాక్టర్ కోసం ఓ రైతును జన్మ భూమి కమిటీ మెంబర్ రూ.30 వేలు డిమాండ్ చేశాడు. రూ.30 వేలు ఇస్తేనే ట్రాక్టర్ మంజూరు చేయిస్తానని చెప్పడంతో ఆ రైతు చేసేది లేక చివరికి జన్మభూమి కమిటీ సభ్యుడు అడిగినంత ముట్ట జెప్పాడు.

☛ టీడీపీ పాలనలో 2014–2019 మధ్య కాలంలో జన్మభూమి కమిటీలు, టీడీపీ నేతలు చెప్పిందే శాసనం. అన్న విధంగా పాలన జరిగింది. ప్రతి దాంట్లోను వారు అధికార దర్పాన్ని ప్రదర్శించారు. వారి ఆజ్ఞ లేనిది ఏపనీ జరిగేది కాదు, ఏ ఫైల్ ముందుకు కదిలేది కాదు. అధికారులు సైతం జన్మభూమి కమిటీ ఆదేశాలకు జీ హుజూర్ అనేవారు. జన్మభూమి కమిటీలకు అడిగినంత ఇవ్వలేక ప్రజలు తీవ్ర ఇబ్బందిపడేవారు. ఒక విధంగా చెప్పాలంటే జన్మభూమి కమిటీలు జనాన్ని పీక్కుతిన్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

పంట నష్ట పరిహారంలోనూ దోపిడీ

అతివృష్టి, అనావృష్టి కారణంగా జరిగే పంట నష్టానికి ఇచ్చే పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలోను టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారు. పంటనష్టం జరగకపోయినా, భూమిలేని వారికి కూడ పంటనష్టం రాయించుకుని అధిక మొత్తంలో పరిహారం కాజేశారు. పంటనష్ట పరిహారంలో ఒక్కో టీడీపీ నేత రూ.50 వేల నుంచి రూ.లక్షల వరకు వసూలు చేశారు.

☞ టీడీపీ జన్మభూమి కమిటీలు చేసిన ఈ ఆగడాలు, అక్రమాలు, వసూళ్లను భరించలేకపోయిన రాష్ట్రప్రజలు ఆ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెప్పారు. రాష్ట్ర చరిత్రను తిరగ రాశారు. కనీవినీ ఎరుగని విధంగా గడిచిన సార్వత్రిక ఎన్నిక(2019)ల్లో వైఎస్సార్‌సీపీకి 151 ఎమ్మెల్యే సీట్లు కట్టబెట్టి తెలుగుదేశం పార్టీని తుంగలో తొక్కి జన్మభూమి కమిటీలపై తమకున్న ఆక్రోశాన్ని తీర్చుకున్నారు.

సంక్షేమ పాలన మెచ్చి..



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

- వైఎస్సార్‌సీపీలో చేరిన 56 కుటుంబాలు
- కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చేసి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరందుకున్నాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గరివిడి మండలంలోని వెదుళ్లవలసలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండదాడి పంచాయతీ పరిధి చిన వెంకటాపురం, పెద వెంకటాపురం.. వెదుళ్లవలస పంచాయతీ పరిధి ఆవగూడెం గ్రామాల నుంచి టిడిపికి చెందిన 56 కుటుంబాలు మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన పాసి బంగారప్పుడు, పాసి రాజప్పుడు, బాగు శ్రీరాములు, మండాది ఆదినారాయణ, మంత్రి చిన్నోడు, లండ గోవింద్, నక్కేల జోగులు, బాగు అప్పయ్య, పల్లె ఈశ్వరరావు, గులివిందల రాము, తదితర 56 కుటుంబాలకు చెందిన వారందరికీ మంత్రి బొత్స సత్యనారాయణ కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని.. జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావటం ఖాయమని జోష్యం చెప్పారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, స్థానిక సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'నిఘా మరింత పెంచాలి'



కొత్తూరు మండలం కర్లెమ్మ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న గంగాధర్

కొత్తూరు: ఎన్నికలు సమీపిస్తున్నందున చెక్‌పోస్టుల వద్ద నిఘాను మరింత పెంచాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ గంగాధర్ అన్నారు. ఆయన కొత్తూరు మండలం కర్లెమ్మ అంతర్ జిల్లా చెక్‌పోస్టును బుధవారం రాత్రి తనిఖీ చేశారు. ఎన్నికలు దగ్గరలో ఉన్నందున నగదు, మద్యం వంటివి అక్రమంగా రవాణ జరిగే అవకాశం ఉందని, సెబ్ స్టేషన్ సిబ్బంది, మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తనిఖీల్లో స్థానిక సీఐ జమరామరెడ్డి, ఎస్ఐ శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా బాధితులను ఆదుకుందాం



రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు అండగా నిలిచేందుకు ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ బి.దేవభూషణ్, కోశాధికారి శిల్లా మణి కోరారు. ప్రపంచ తలసేమియా దినం సందర్భంగా బుధవారం నగరంలోని లయన్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు మేనేజర్ కె.సునీల్, రవి, సాహు, దాతలు ఈ.నాగరాజు, జి.సురేష్‌కుమార్, ఎస్.సత్యనారాయణ, బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో లోపాలుండకూడదు

- ఆర్ఓ విష్ణుచరణ్

సాలూరు: ఎన్నికల ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు తలెత్తకూడదని ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరి శీలించారు. ఎన్నికల సిబ్బందికి మంచినీరు, అల్పాహారం, భోజనం తదితర పంపిణీ కౌంటర్లపై ఆరా తీశారు. సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడ ఎన్నికల సామగ్రి తీసుకోవాలనే అంశంపై సందేహాలకు తావులేకుండా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను ఆయన పరిశీలించారు. హోమ్ ఓటింగ్ బ్యాలెట్‌లను సీల్ చేశారు.

విజయమే లక్ష్యంగా..

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఊరూరా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి పాలనను వివరిస్తున్నారు. ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని తెలియజేస్తున్నారు. చేసిన మేలును మనసులో పెట్టుకుని ఓటుతో ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రచార పర్వం



విజయనగరం లంకవీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి అక్కడి మహిళలు హారతిచ్చి విజయతిలకం దిద్దారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తామని మాట ఇచ్చారు.



డెంకాడ మండలం జొన్నాడ గ్రామంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 59 నెలల్లో గ్రామస్తులకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. మరింత మంచిపాలన అందించేందుకు ఓటుతో ఆశీర్వదించాలని అభ్యర్థించారు.



బొబ్బిలిలో ప్రచారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. మా కుటుంబానికి మేలు జరిగిందని, ఓటు వేస్తామని స్పష్టం చేశారు.



రాజాం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ మల్లయ్యపేటలో ఇంటింటి ప్రచారం చేశారు. ఓ వృద్ధురాలి చేతులు పట్టుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలంటూ ఆప్యాయంగా అభ్యర్థించారు.




మెరకముడిదాం మండలం చినబంటుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి పాలనను ఆశీర్వదించాలని, పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక వికాసం, పిల్లల బంగారు భవిత కోసం ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు.

పోలింగ్‌లో ఏజెంట్లే కీలకం

- దొంగ ఓటర్లను గుర్తించే అవకాశం

హిరమండలం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఏజెంట్లది కీలక పాత్ర. పోలింగ్ బూత్‌లో ఉన్న ఏజెంట్లందరూ ఒక్కటైపోతే దొంగ ఓటర్లు సులువుగా ఓటు వేసుకునే అవకాశం ఉంటుంది. అందుకే పార్టీ నాయకులు ఏజెంట్ల ఎంపిక విషయంలో చాలా అప్రమత్తంగా ఉంటారు. ఎవరైతే పార్టీకి విధేయులుగా ఉంటారో వారినే నియమిస్తారు. దొంగ ఓట్లు వేసే వారిని అడ్డుకోవడం, ఒక వేళ దొంగ ఓటు వేయడానికి ఎవరైనా వస్తే వారిని గుర్తించి పోలింగ్ అధికారులకు తెలియజేయడం వంటివి చేస్తుంటారు. ఓటర్లను పోలింగు ఏజెంట్లు గుర్తించిన తర్వాతే ఓటు వేసేందుకు పోలింగు సిబ్బంది అనుమతిస్తారు. వాస్తవంగా ప్రతి పోలింగ్‌స్టేషన్ లోనూ అభ్యర్థుల తరఫున ఏజెంట్లను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. ఇందుకు ముందుస్తుగా వారి వివరాలను ఎన్నికల అధికారులకు అందజేయాలి. ఆ తర్వాత ఎన్నికల అధికారి ఫొటో గుర్తింపు కార్డు ఇస్తారు. గతంలో ఎన్నికల అధికారుల ఫొటోలు లేకుండా గుర్తింపు



కార్డులు మంజూరు చేసేవారు. ఒకరి తరఫున మరొకరు ఏజెంట్లుగా వ్యవహరించే అవకాశం ఉన్నందున ఎన్నికల అధికారులు ఫొటో గుర్తింపు కార్డులను ఇస్తున్నారు.

నియామకం ఇలా..

ప్రతి అభ్యర్థి తమకు నమ్మకమైన వారికి ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో పాటు ఓటరు జాబితాలోని సీరియల్ నంబర్‌ను తీసుకుని ముందుగా పార్టీ కార్యాలయాలకు పంపిస్తారు. అక్కడ నుంచి అనుమతి వచ్చిన తర్వాత ఎన్నికల అధికారులకు ఆ జాబితా అందజేస్తారు. వారి పరిశీలన అనంతరం ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా ఏ పోలింగ్ స్టేషన్‌లో ఏజెంటుగా వ్యవహరించాలి.. అనే వివరాలతో గుర్తింపు కార్డులను మంజూరు చేస్తారు. ఒక పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన గుర్తింపు కార్డు పొంది మరో కేంద్రంలో ఏజెంటుగా వ్యవహరించేందుకు అనుమతించరు.

ఎవరు అర్హులంటే..?

- పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి పోలింగ్ కేంద్రంలో గానీ ఆ పరిధిలో ఉంటే గ్రామంలో గానీ ఓటరై ఉండాలి.
- ఓటు హక్కు లేని వారిని నియమించరు.
- పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి వచ్చే వారిని గుర్తించేందుకు మాత్రమే ఏజెంట్లను నియమిస్తారు. అంతేకానీ వారికి ఎలాంటి అధికారాలు ఉండవు.
- పోలింగ్ ఏజెంటుగా ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో ఎలాంటి ప్రచారం చేయకూడదు.
- ఏదైనా పార్టీ తరఫున కేంద్రంలో ప్రచారం చేస్తున్నట్లు పోలింగ్ సిబ్బంది గమనిస్తే ముందుగా హెచ్చరించిన తరువాత బయటకు పంపిస్తారు.
- ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక అభ్యర్థికి ఇద్దరు చొప్పున ఏజెంట్లును నియమించుకునే వీలుంది.
- ఇద్దరు ఏజెంట్లు ఒకేసారి ఉండేందుకు అనుమతించరు.
- లోక్‌సభ అభ్యర్థి తరఫున ఇద్దరు, అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి తరఫున ఇద్దరు చొప్పున ఏజెంట్లను నియమిస్తారు.
- ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలను చూడాల్సి ఉంది.

ఓటే వజ్రాయుధం

- ఎన్నికల పరిశీలకులు తలాత్ పర్వేజ్
- స్వీప్ కార్యక్రమంలో భాగంలో బైక్ ర్యాలీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిలా, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ విజయనగరం పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీ

విజయనగరం అర్బన్: ఓటు వజ్రాయుధం వంటిదని, ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లా పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ విజయనగరం పట్టణంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీను కలెక్టరేట్ వద్ద తలాత్ పర్వేజ్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ ప్రారంభించారు. స్వయంగా మోటార్ సైకిల్ నడిపి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ ఆర్అండ్‌బీ జంక్షన్, మయూరి, ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేద్కర్ జంక్షన్, కోట, మూడు లాంతర్లు, గంటస్తంభం మీదుగా రాజీవ్ క్రీడామైదానం వరకు సాగింది. అక్కడ మానవహారాన్ని నిర్వహించి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తలాత్ పర్వేజ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో జరుగుతున్న ఈ ఎన్నికలు, ప్రజాస్వామ్య మనుగడకు మూలాధారమని పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ అన్ని చర్యలు తీసుకుందన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.